# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 99 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 19 జూలై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




### ఉత్తమ తెలుగు చిత్రం

# కమిటీ కుర్రాళ్లు

**కల్కి 2898ఏడీ, పుష్ప2, దేవర, లక్కీ భాస్కర్ లకు అవార్డులు**

**2024 సంవత్సరానికిగాను ప్రకటన**

**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

72వ నేషనల్ ఫిలిం అవార్డ్స్ విన్నర్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024కు సంబంధించి అవార్డులను ప్రకటించింది కేంద్రం. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలతో సత్కరించనున్నారు. సౌత్ నుంచి ఇంట్రెస్టింగ్ సినిమాలో పోటి పడుతున్నారు. టాలీవుడ్ నుంచి కల్కి 2898 ఏడీ, పుష్ప 2, దేవర, లక్కీ భాస్కర్, 35 చిన్న కథ కాదు, క సినిమాలు రేసులో ఉన్నాయి. తాజాగా ప్రకటించిన అవార్డులలో బెస్ట్ ఫిలిం క్రిటిక్ సంజీవ్ శ్రీవాత్స ( హిందీ), బెస్ట్ బుక్ ఆన్ సినిమా కన్నడ సినిమాడ తత్వ మత్తు రాజకీయ (కన్నడ బుక్) కెంచనూరు ప్రదీప్ కుమార్ శెట్టి అవార్డులు అందుకున్నారు.

**విజేతలు వీరే..**

బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ -- సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ)
బెస్ట్ సినిమాటోగ్రఫీ -- లైవ్ ఇన్ లూమ్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరి: బెస్ట్ స్క్రిప్ట్–ఓబుర్
బెస్ట్ డైరెక్షన్ -- ఆనంద్రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)
బెస్ట్ డాక్యుమెంటరీ -- రామ్ నమీ

..మిగతా 2లో

## నేనున్నంత వరకు బిఆర్ఎస్

# అధికారంలోకి రావడం కల్ల

**అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కేసీఆర్**

**దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ**

**వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు**

**నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల**

**నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు**

**అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు**




**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను ..మిగతా 2లో

# మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్

**కొలువుల కుంభమేళా కాదు..**

**కుంభకోణాల కుంభమేళా**

**ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి**

**తెలంగాణలో లూటీ జరుగుతోంది**

**చాయ్ పే చర్చాను మరచిన రాహుల్**

**బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు**



**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం



# పోలవరంలో విషాదం

**చేపల వేటకు వెళ్లిన మునిగిన మత్స్యకారులు**

**ఆరుగురు వ్యక్తుల మృత్యువాత**

**పోలవరం, జులై 18 (ప్రభాత ఉదయం)**

పోలవరం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లిన ఐదుగురు వ్యక్తులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ఉదంతం జిల్లాలోని ఎటపాక మండలం గొల్లగూడెం గ్రామ సమీపంలో జరిగింది. ప్రాథమిక వివరాల ప్రకారం.... ..మిగతా 2లో




# దూసుకెళ్లిన విక్రమ్-1

**చారిత్రిక ప్రయోగం సక్సెస్**

**అంతరిక్ష పరిశోధనలో సరికొత్త అధ్యాయం**

**ప్రశంసించిన ప్రధాని నరేంద్ర మోడీ**

**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

భారతదేశ అంతరిక్ష పరిశోధన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది! దేశీయ ప్రైవేట్ అంతరిక్ష రంగానికి సరికొత్త రెక్కలు తొడుగుతూ.. ప్రముఖ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' రూపొందించిన 'విక్రమ్–1' రాకెట్ ఆదివారం నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు ఈ చారిత్రాత్మక ప్రయోగం జరిగింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ తొలి ఆర్బిటల్ టెస్ట్ ఫ్లైట్, భారతీయ ప్రైవేట్ రంగాన్ని అంతర్జాతీయ శాటిలైట్ లాంచ్ మార్కెట్లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మొదటి అడుగుగా నిలిచింది. భారత అంతరిక్ష పితామహుడు ..మిగతా 2లో

## బూతులు తిడిదే

# అది అశ్లీలత కాదు

**క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోలేం**

**లైంగికంగా ప్రేరేపించేలా ఉంటేనే చర్యలు**

**తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, జులై 18 (ప్రభాత ఉదయం)**

కోపంలోనో, గొడవల్లోనో వాడే తిట్లు, అసభ్య పదజాలం లేదా బూతులు ఎంత అసహ్యకరంగా ఉన్నప్పటికీ, వాటిని క్రిమినల్ చట్టం ప్రకారం నేరుగా అశ్లీలత కింద పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక మాటను అశ్లీలంగా భావించాలంటే దానికి చట్టపరమైన నిర్దిష్ట ప్రమాణాలు ఉండాలని, అది వినేవారిని లైంగికంగా ప్రేరేపించేలా లేదా దిగజార్చేలా ఉంటేనే ఆ సెక్షన్ వర్తిస్తుందని కోర్టు తెలిపింది. తమిళనాడుకు చెందిన మణి అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను పాక్షికంగా అనుమతిస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎమ్. పాంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. 2017 ఆగస్టులో తమిళనాడులో జరిగిన ఒక వ్యవసాయ భూమి వివాదంలో మణి అనే వ్యక్తి తన ప్రత్యర్థులను అత్యంత అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా కొడవలితో దాడి చేసి ఒకరి ముక్కు ఎముక విరిగేలా చేశాడు. ఈ కేసులో ట్రయల్ కోర్టు అతనికి ఐపీసీ సెక్షన్ 294(బి) (అశ్లీలత), 326 (తీవ్రమైన గాయం చేయడం), 506(ఐఐ) (క్రిమినల్ బెదిరింపు), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద శిక్ష విధించింది. మద్రాస్ ..మిగతా 2లో

## ఆహార కల్తీ నిరోధానికి

# పటిష్టమైన చట్టం

**ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం**

**సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు**

**వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన**

**అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**



2లో..

# నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల

**మొదటి పేజీ తరువాయి...**

నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో,




కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

## దూసుకెళ్లిన విక్రమ్-1

**మొదటి పేజీ తరువాయి...**

డాక్టర్ విక్రమ్ సారాభాయ్ స్మృత్యర్థం ఈ రాకెట్‌కు 'విక్రమ్' అని పేరు పెట్టడం విశేషం. వాస్తవానికి తొలుత ఉదయం 11:30 నిమిషాలకు విక్రమ్-1 టేకాఫ్ జరగాల్సి ఉంది. చివరి నిమిషంలో వాయిదా పడింది. మళ్లీ టేకాఫ్ ఎప్పుడు ఉంటుంది? అని సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న సమయంలో.. కాస్త ఆలస్యంగా, మధ్యాహ్నం 12:30కి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లింది. విక్రమ్-1 మోసుకెళ్తున్న పేలోడ్స్‌లో అత్యంత కీలకమైంది 'ఎంబ్రేస్' మిషన్. అంతరిక్షంలో ప్రమాదకరంగా మారుతున్న శకలాలు, వ్యర్థాలను తొలగించడానికి భవిష్యత్తులో ఉపయోగపడే రోబోటిక్ ఆర్మ్ సాంకేతికతను ఈ ప్రయోగం ద్వారా పరీక్షించనున్నారు. ఒక ప్రైవేట్ రాకెట్ ద్వారా ఈ తరహా ప్రయోగం జరగడం దేశంలోనే ప్రథమం. ఈ మిషన్‌లో ఒక ప్రత్యేకమైన మైక్రో ఆర్ట్ ట్రిబ్యూట్‌ని కూడా అంతరిక్షంలోకి పంపుతున్నారు. 18 క్యారెట్ల బంగారంతో చేసిన ఒక సూక్ష్మ రాకెట్‌లో భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాల మూలస్తంభాలైన డాక్టర్ విక్రమ్ సారాభాయ్, సర్ సీవీ రామన్, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ విగ్రహాలను ఉంచారు. ఇది సైన్స్, జాతీయ వారసత్వాల అద్భుత కలయిక. కళాత్మక ప్రదర్శనలో భాగంగా, ల్యాబ్‌లో కృత్రిమంగా తయారు చేసిన 'కాస్మిక్ బ్లూమ్' అనే వజ్రాన్ని ఈ రాకెట్ ద్వారా అంతరిక్ష కక్ష్యలోకి పంపుతున్నారు. వ్యాపారపరమైన అంతరిక్ష ప్రయోగాలకు సృజనాత్మకతను జోడించవచ్చని ఈ మిషన్ నిరూపిస్తోంది. 'మిషన్ ఆగమన్' ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన శుభాకాంక్షల సందేశాన్ని రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్తోంది. 'వందేమాతరం' అనే నినాదంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వందలాది మంది మద్దతుదారుల అభినందనల కార్డును కూడా ఈ రాకెట్ మోసుకెళ్లనుంది. ఇది భారతదేశ విస్తరిస్తున్న అంతరిక్ష ఆకాంక్షలను దేశ పౌరుల ఆశయాలతో అనుసంధానించేలా ప్రదర్శించనున్నారు.

## మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్

**మొదటి పేజీ తరువాయి...**

చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

**ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం**

**సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు**

**వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన**


**అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**




**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ తెలుగు చిత్రం కమిటీ కుర్రాళ్లు

బెస్ట్ తెలుగు ఫిలిం : కమిటీ కుర్రోళ్ళు

జాతీయ ఉత్తమ చిత్రం బెస్ట్ ఫీచర్ ఫిలిం: ఆర్టికల్ 370, డైరెక్టర్ ఆదిత్య సుహాస్

జాతీయ ఉత్తమ నటి : యామీ గౌతమ్ -- ఆర్టికల్ 370

బెస్ట్ యాక్టర్ : కార్తీక్ ఆర్యన్ , సినిమా చందు ఛాంపియన్.

బెస్ట్ డైరెక్టర్: అమరన్ -- డైరెక్టర్ రాజ్ కుమార్ పెరిసామి

బెస్ట్ చిల్డ్రన్స్ ఫిలిం: చిన్న కథ కాదు -- డైరెక్టర్ నందకిషోర్ ఈమని

బెస్ట్ పాపులర్ ఫిలిం : కల్కి 2898 ఏడి , డైరెక్టర్ నాగ్ అశ్విని

బెస్ట్ తెలుగు ఫిలిం : కమిటీ కుర్రోళ్ళు- డైరెక్టర్: యదు వంశీ

బెస్ట్ మేకప్: కమిటీ కుర్రోళ్ళు , మేకప్ ఆర్టిస్ట్ రవికుమార్

బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ పుష్ప 2 , కాస్ట్యూమ్ డిజైనర్ దీపాలే నూర్ శీతల్ శర్మ

బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్: కల్కి 2898 నితిన్ జీహాన్ చౌదరి

బెస్ట్ స్క్రీన్ ప్లే డైలాగ్ రైటర్: లక్కీ భాస్కర్ , డైలాగ్ రైటర్ అట్లూరి వెంకీ

బెస్ట్ స్క్రీన్ ప్లే రైటర్: పుష్ప 2- సుకుమార్

బెస్ట్ హిందీ ఫిలిం : శ్రీకాంత్, డైరెక్టర్ తుషార్ హిరానందనీ

బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్: అమరన్, మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్

బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ :చిన్న కథ కాదు, చైల్డ్ ఆర్టిస్టు అరుణ్ దేవ్ పోతుల

## బూతులు తిడిదే అది అశ్లీలత కాదు

**మొదటి పేజీ తరువాయి...**

హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కేసును కొట్టివేసినప్పటికీ.. ఐపీసీ శిక్షలను అలాగే ఉంచడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఐపీసీ సెక్షన్ 294(బి) కింద అశ్లీలత అనే నేరాన్ని మోపాలంటే కేవలం చెడు మాటలు మాట్లాడితే సరిపోదని స్పష్టం చేసింది. "చట్టప్రకారం అశ్లీలత అనేది కేవలం అసభ్యత లేదా తిట్లకు సమాన అర్థం కాదు. గొడవల సమయంలో వాడే బూతు పదాలు వినడానికి అసహ్యంగా, దిగ్భ్రాంతికరంగా అనిపించవచ్చు. కానీ అవి ఎదుటివారిని మానసికంగా లేదా నైతికంగా దిగజార్చేలా ఉంటేనే అశ్లీలత అవుతుంది. అంతేకాకుండా ఆ మాటల వల్ల పబ్లిక్ స్థలంలో ఇతరులకు ఇబ్బంది కలిగిందనే రుజువు కూడా ఉండాలి. ప్రస్తుత కేసులో నిందితుడు తిట్టిన తిట్లు కేవలం కోపంలో అన్నవే కానీ అవి చట్ట పరిధిలోని అశ్లీలత కిందికి రావు" అని అభిప్రాయపడింది. ఇదే ప్రాతిపదికన గొడవ పడేటప్పుడు వాడే హెచ్చరికలన్నీ క్రిమినల్ బెదిరింపుల కిందకు రావంటూ సెక్షన్ 506(ఐఐ) శిక్షను కూడా కోర్టు రద్దు చేసింది. బూతులు, బెదిరింపుల సెక్షన్లను కొట్టేసినప్పటికీ.. నిందితుడు కొడవలితో దాడి చేసి బాధితుడి ముక్కు ఎముకను విరగ్గొట్టినట్లు మెడికల్ రిపోర్టులలో స్పష్టంగా రుజువైంది. అందువల్ల సెక్షన్ 326 కింద నిందితుడి నేరాన్ని కోర్టు సమర్థించింది. అయితే ఈ వివాదం భూమి గొడవల వల్ల జరిగిందని, ప్రస్తుతం నిందితుడి వయస్సు దాదాపు 70 ఏళ్లు దాటడం, అతని ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శిక్షను తగ్గించింది. కోర్టు సమయం ముగిసేవరకు జైలు శిక్ష విధిస్తూ, రూ. 50,000 జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాల్సి ఉంటుంది.

## పోలవరంలో విషాదం

**మొదటి పేజీ తరువాయి...**

గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు చేపల వేట కోసం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలోకి దిగారు. అయితే... ఆ ప్రాంతంలో నది లోతు ఎక్కువగా ఉండటంతో ప్రవాహ ఉధృతికి వారంతా ఒక్కసారిగా నీటిలో మునిగి గల్లంతయ్యారు. నీటిలో మునిగిపోవడంతో ఊపిరాడక ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మరియు సహాయక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో మునిగిపోయిన ఐదు మృతదేహాలను సిబ్బంది బయటకు వెలికితీశారు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నట్లు ధృవీకరించారు. వీరంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన ఒకే ప్రాంతం వారు కావడంతో ఆ గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. చేపల వేటకు వెళ్లిన వారు శవాలై ఇంటికి రావడంతో మృతుల కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఒకేరోజు... ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో గొమ్ముకొత్తగూడెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘోర ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు ప్రారంభించారు.

**వైఎస్ జగన్ దిగ్భ్రాంతి...**

గోదావరిలో ఐదుగురు గిరిజనుల మృతి మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉండటం హృదయవిదారకమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచి, తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


# హిమాయత్ సాగర్ ఔటర్ రింగురోడ్డులో రోడ్డు ప్రమాదం, ఒకరు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖాజ



గాయపడ్డ యువకులు




చెట్లల్లోకి దూసుకెళ్లిన కారు

**బుద్వేల్ జూలై 18 (ప్రభాత ఉదయం)**

దుబాయ్ కు వెళుతున్న స్నేహితునికి వీడ్కోలు పలుకడానికి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి కారు లో బయలు దేరి హిమాయత్సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలకు గురైనారు. కారు డివైడర్ ను ఢీ కొని పక్కనే ఉన్న చెట్లలలోకి పడిపోయింది. రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... గుల్బర్గా ప్రాంతానికి చెందిన ఓ యువకుడు దుబాయ్ కు వెళుతున్నాడు. ఆ యువకుడు తన తల్లి తో కలసి కారులో శుక్రవారం రాత్రి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు బయలు దేరాడు. ఆ యువకునికి సెండ్అప్ ఇవ్వడానికి గుల్బర్గా ప్రాంతానికి చెందిన నలుగురు స్నేహితులు ఖాజ, జమీర్, యాకుబ్, అక్బర్లు కెఎ29ఎన్ 1908 నెంబర్ స్విఫ్ట్ డీజైర్ కారులో బయలు దేరారు. వీరి కారు శుక్రవారం రాత్రి 2 :15 నిమిషాలకు హిమాయత్ సాగర్ ఔటర్ రింగురోడ్డు వద్దకు వచ్చింది. కారు నడుపుతున్న వ్యక్తి కారు ను అతి వేగంగా నడపడం కారణంగా డివైడర్ ను ఢీ కొని పక్కనే ఉన్న చెట్ల లోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఖాజ అక్కడిక్కడే మృతి చెందారు. కారు లో ప్రయాణిస్తున్న జమీర్. యాకుబ్, అక్బర్లకు తీవ్ర గాయాలైనాయి. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి మృతి చెందిన జాజ మృతదేహన్ని ఉస్మానియా మార్చ్యులికి తరలించారు.

## భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి : సుంకర రామ్మోహన్ రావు

**బుద్వేల్, జూలై 18 (ప్రభాత ఉదయం):**



భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆధర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) రాష్ట్ర అధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు తెలిపారు. శనివారం ఆయన రాజేంద్రనగర్ లో విలేకరుల తో మాట్లాడుతూ, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు.ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో నెం 12ను రద్దు చేసి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వమే అందించాలన్నారు. సీఎస్ సీ సంస్థ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులందరికి హెల్త్ కార్డులివ్వాలన్నారు. సహజ మరణానికి నష్టపరిహారం రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న 54 వేల పెండింగ్ క్లెయిమ్ లకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ నెలకు రూ. 6వేలు, పిల్లల చదువుకు స్కాలర్ షిప్, గృహ వసతి, అడ్డాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీ ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సెస్సు నిధులు కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. 2009 నుంచి రెన్యువల్ కానీ 13 లక్షల కు పైగా ఉన్న లేబర్ కార్డులను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అర్హత కలిగిన భవన నిర్మాణ కార్మికులకు నమోదు చేసుకున్న 15 రోజులలోగా లేబర్ కార్డులను అందచేయాలన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేయవద్దన్నారు. లేబర్ కార్డు ఉండి కార్మికుడు ఏ రాష్ట్రంలో మరణించినా, నష్టపరిహారాలు ఇవ్వాలన్నారు. వరుస కార్మికుల పేర్లను బోర్డులో నమోదు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కు జరుగుతున్న పోరాటంలో కార్మిక లోకం అంతా కదిలిరావాలని సుంకర రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు.




వర్జీనియా విశ్వవిద్యాలయం ప్రతినిధులతో సమావేశమైన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి

## పందిరి కూరగాయలలో పండుగ ఈగ యాజమాన్యంపై పరిశోధనలకు అమెరికా లోని వర్జీనియా విశ్వవిద్యాలయంతో కలసి ఉద్యాన వర్శిటీ పరిశోధనలు

**బుద్వేల్, జూలై 18 (ప్రభాత ఉదయం)**

పందిరి కూరగాయలైన కాకర, బీర, సొర, దోస వంటి పంటల పంటలను ఆశించి నష్టపరిచే పండు ఈగ యాజమాన్యంపై అమెరికా లోని వర్జీనియా టెక్ విశ్వవిద్యాలయంతో కలసి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పనిచేయనున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. వర్జీనియా టెక్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, ప్రముఖ ప్రపంచ కీటక నిపుణులు డాక్టర్ మునియప్పన్, ఎకనమిస్ట్ డాక్టర్ అనుప గుప్తా లతో కూడిన ప్రతినిధుల బృందం ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తో సమావేశమైనారు. ఈ సందర్భంగా పందిరి కూరగాయల పంటలలో ఇటీవల కాలం పండు ఈగ ఒత్తిడి బాగా పెరిగిందని రసాయనాలతో యాజమాన్యం కొనసాగిస్తే భవిష్యత్తులో కష్టమౌతుందని ప్రత్యామ్నాయంగా కేవలం రసాయనాలపైనే ఆధారపడకుండ సమగ్ర పద్దతులతో పండు ఈగ యాజమాన్యం చేపట్టాలని కోరారు. హైదరాబాద్ చుట్టు పక్కల కూరగాయలు పండించే 25 గ్రామాలలో ఉద్యాన విశ్వవిద్యాలయం, అమెరికా వర్జీనియా టెక్ యూనివర్శిటీ తో కలసి కూరగాయలలో తామర పురుగులు, వంకాయలలో కాయ, కొమ్మ తొలిచే పురుగులు, క్యాబేజీ, కాలిఫ్లవర్ లో డైమండ్ బ్యాక్ మాత్ యాజమాన్యంపై నూతన పరిశోధనలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు డాక్టర్ జే చీనా, వర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కె వీరాంజనేయులు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ సురేశ్ కుమార్, డాక్టర్ రాజశేఖర్, కూరగాయల పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ డి అనిత కుమార్, టెక్నికల్ సెక్రటరీ డాక్టర్ పిడిగెం సైదయ్య, ఏటీజీసీ బయోటెక్ ఎండీ డాక్టర్ మార్కండేయ, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ వీబీ రెడ్డి, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి రాజ్యాంగం ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు

### బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు తొండ రవి

**రాజేంద్రనగర్, జూలై 18(ప్రభాత ఉదయం)**

ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి రాజ్యాంగం ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు అని బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు తొండ రవి అన్నారు. శనివారం అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ లోని బూత్ నంబర్లు 238, 239, 240, 241 బూత్ ల లో ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లకు అందజేశారు. ఈ బూతులలోని పోలింగ్ స్టేషన్ డోనాల్డ్ స్కూల్ శక్తి కేంద్రంగా భారతీయ జనతా పార్టీ తరఫున ఏర్పాటుచేసిన ఎస్. ఐ. ఆర్. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ సహాయ కేంద్రానికి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు, ఎస్. ఐ. ఆర్ రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్చార్జ్ తొండ రవి విచ్చేసి ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క ఓటరూ తప్పకుండా తమ ఎన్యుమరేషన్ ఫారం ను నింపి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని తెలియజేసినారు. వారికి బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలియజేసినారు. ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోగలరని తెలియజేసినారు. మరియు ఇప్పటివరకు కూడా ఎమ్యూనరేషన్ ఫార్మ్ అందని వారు వారి ఓటర్ ఐడి కార్డు గాని ఆధార్ కార్డు గాని తమతో తీసుకొని వస్తే ఎమ్యూరేషన్ ఫారమ్ ఏ బి. ఎల్. ఓ. దగ్గర ఉందో వాటి వివరాలు కూడా తమ కార్యకర్తలు యాప్ లో పరిశీలించి తెలియజేస్తారని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ ఎస్ ఐ ఆర్ ఫామ్ తీసుకొని వీలైనంత తొందరగా, చివరి రోజున మళ్ళీ ఇబ్బందులు పడకుండా, నింపి ఇస్తేనే వారి ఓటు సురక్షితంగా ఉంటుందని లేకపోతే డిలీట్ అయ్యే ప్రమాదం ఉందని తెలియజేసినారు. ఇప్పుడు ఫారమ్స్ తిరిగి ఇచ్చిన వారికి మాత్రమే ఆగస్టు 10వ తేదీ తర్వాత మార్పులు చేర్పులు కరెక్షన్స్ చేసుకునే అవకాశం ఉందని తెలియజేసినారు. పాల్గొన్నవారు : బిజెపి సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్ మధుమోహన్ రెడ్డి , వరుణ్ రాజే , రంగారెడ్డి జిల్లా బిజెపి ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సులిగే వెంకటేష్, బీ. ఎల్. ఏ 2 నారగూడెం సోంనాథ్ రెడ్డి,సీనియర్ నాయకులు చెట్టిగారి శేఖర్, కవేలిగూడెం బాలు ,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొక్కరికి తీవ్ర గాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం)**




గద్వాల మండలం కుర్వపల్లి స్టేజ్ సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. అమరవాయి గ్రామానికి చెందిన హరికృష్ణ(23శ్రీ, యేసోపు ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు. కాగ శనివారం గద్వాలలో పనులు పూర్తి చేసుకుని అమరవాయి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గద్వాల మండలం కుర్వపల్లి స్టేజ్ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ(23) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన యేసోపు ను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరికృష్ణ భార్య ప్రస్తుతం నిండు గర్భిణి గా ఉంది. పోస్టు మార్టం నిమిత్తం హరికృష్ణ మృతదేహాన్ని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం యేసోపును కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కాగ ప్రమాదానికి గల కారణాలపై గద్వాల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదం బైక్ అతివేగం వల్ల జరిగిందా? లేక ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్ళిందా? అనే కోణంలో కేసు నమోదు చేసుకుని గద్వాల రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## బీఆర్ఎస్‌తోనే యువతకు న్యాయం

### యువ సంగ్రామ సదస్సుకు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులుపార్టీ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి

**రాజేంద్రనగర్,జులై18(ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీతోనే యువతకు న్యాయం జరుగుతుందని రాజేంద్రగనర్ సర్కిల్ పార్టీ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు.నిరుద్యోగ యువత తరఫున బీఆర్ఎస్ గళమెత్తితే అధికార పార్టీ గుండెల్లో గుబులు మొదలైందని వ్యాఖ్యానించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును నిలదీస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సుకు' అత్తాపూర్ సర్కిల్ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు,నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువ సంగ్రామ సదస్సుకు అనుమతిస్తే వెళ్లకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు.యువ సంగ్రామ సదస్సుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు.హైకోర్టు పర్మిషన్ ఉన్నా,మల్కాజిగిరి సీపీ సుమతి స్వయంగా యువ సంగ్రామ సదస్సుకు అనుమతినిచ్చినా బీఆర్ఎస్ నాయకులను వెళ్లనివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడం అత్యంత దారుణమన్నారు.ఒకవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని పెద్ద పెద్ద నీతులు చెబుతుంటే,ఇక్కడ తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి పౌరుల రాజ్యాంగ హక్కులను నిస్సిగ్గుగా కాలరాస్తున్నాడని మండిపడ్డారు.కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని, నమ్మించి మోసం చేయడంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడని ఆరోపించారు.నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని,జాబ్ నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. సదస్సుకు తరలి వెళ్లిన వారిలో సర్కిల్ నాయకులు ఏరోళ్ల యాదయ్య,సదాల వెంకట్ రెడ్డి,ఆనంద్ రెడ్డి,సరికొండ దుర్గేష్,వీర్లపల్లి నవీన్ కుమార్,నాగేష్,విజయ్,గిరి బాబు,రాముయాదవ్,యాదయ్య,నికిలేష్,ధీరజ్,ఈ.చింటూ,సతీష్,నాని,అఖిల్,ఈ.నీరజ్,బీఆర్వీ స్వీ ప్రెసిడెంట్ నికిలేష్ రెడ్డి,అనుదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీ ఎల్ ఓ లతో రాజేంద్రనగర్ ఏ ఈ ఆర్ ఓ, తహసిల్దార్ బొమ్మ రాములు

## ఆదివారం ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఎలకు అందజేయవచ్చు

### ఏఈఆర్ఓ బొమ్మ రాములు

**బుద్వేల్, జూలై 18 (ప్రభాత ఉదయం)**

ఈ నెల 19న ఆదివారం లక్ష్మీగూడ, మైలార్దేవుపల్లి, శాస్త్రీపురం, బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతాలకు చెందిన పోలింగ్ కేంద్రాలకు సంబందించిన బీఎల్ ఓ లు ఓటర్లకు అందుబాటులో ఉంటారని రాజేంద్రనగర్ తహసీల్దార్, ఏఈఆర్ ఓ బొమ్మ రాములు తెలిపారు. శాస్త్రీపురం పరిసర ప్రాంతాలలో ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, తిరిగి తీసుకోవడం చేస్తున్న బీఎల్ఓ ల పనితీరు ను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆదివారం బీఎల్ లు అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద, బస్తీ కూడళ్ల వద్ద అందుబాటులో ఉంటారని, వారికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల పట్ల ఎవరు నిర్లక్ష్యంగా ఉం డకూడదన్నారు.



పోలీసులతో వాదిస్తున్న బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి

## బహదూర్ గూడ గ్రామ రైతులకు న్యాయం చేయాలి


### తోకల శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, జూలై 18 (ప్రభాత ఉదయం)**

బుల్లెట్ ట్రైయిన్ పేరుతో శంషాబాద్ మండలం బహదూరర్గుడ గ్రామంలో రైతులకు చెందిన భూములను లాక్కోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహదూర్గూడ గ్రామ రైతులకు సంఘీభావం తెలుపడానికి వెళుతున్న తోకల శ్రీనివాస్ రెడ్డి ని శనివారం ఉదయం మైలార్దేవుపల్లి ప్రగతి కాలనీ లోని ఆయన నివాసంలో మైలార్దేవుపల్లి పోలీసులు అడ్డుకున్నారు. దానికి ఆయన ప్రతిఘటించి పోలీసులతో తలపడి బహదూర్గూడ గ్రామానికి వెళ్లడానికి ప్రయత్నించగా తోకల శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. తోకల శ్రీనివాస్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు అడికె జనార్దన్, రావుల భాస్కర్, గోద పాండు, పి సంతుగౌడ్, సి బుచ్చిరెడ్డి, తలారి చిన్న, మన్మోహన్రెడ్డి, ఎల్బీ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, రమేశ్ రెడ్డి, నవారు మురలీధర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శం కర్ రెడ్డి, కె రామారావు, శేఖర్ లను అరెస్ట్ చేసిన పోలీసులు కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలిం చారు.

## నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జూలై 18(ప్రభాత ఉదయం)**



గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. గగన్‌పహాడ్ సబ్-స్టేషన్ పరిధిలో ఉదయం 08:30 గంటల నుండి 10:30 గంటల వరకు ఆర్ఈసీ ఫీడర్ పరిధిలోని బడ్వెల్ రైల్వే స్టేషన్, పరివార్ ధాబా, ప్రెస్టీజ్, డైమండ్ కాంటా ,ఉదయం 08:30 గంటల నుండి. ఉదయం 10:30 గంటల వరకు మీనా కెమికల్ ఫీడర్ పరిధిలోని పుకత్‌నగర్, డ్రీమ్ ఇండియా ఇండస్ట్రియల్ ఏరియా, డ్రీమ్ మోనార్క్, మీనా కెమికల్ ఏరియా,ఉదయం 08:30 గంటల నుండి 10:30 గంటల వరకు పిలికాన్ రబ్బర్ ఫీడర్ పరిధిలో చైనా గోశాల, ప్రముఖ్ కుమార్ జోషి, వెంకటేశ్వర ప్లెక్సో, ఇండస్ట్రియల్,ఉదయం 08:30 గంటల నుండి 10:30 గంటల వరకు మెట్రోమాల్ ఫీడర్ పరిధిలోని గగన్‌పహాడ్ గ్రామం, మెట్రోమాల్, పారిశ్రామిక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# కన్నతల్లి పక్కనుంచే మూడేళ్ల చిన్నారి అపహరణ..

## అమ్మేసేలోపే కాపాడిన సైబరాబాద్ పోలీసులు!

**అక్రమ దత్తతల ముఠా గుట్టురట్టు.. ముగ్గురు నిందితుల అరెస్ట్**

**తెరవెనుక సూత్రధారి ప్రైవేట్ ల్యాబ్ నర్సు!**

**శేరిలింగంపల్లి : జూలై 18, (ప్రభాత ఉదయం)**

ఆ కన్నతల్లి బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతం నుండి వచ్చి రైల్వే స్టేషన్ ఫుట్‌పాత్‌నే ఆశ్రయించింది. పగలతా కష్టపడి అలసిపోయి తన కంటిపాపను గుండెలకు హత్తుకుని నిద్రపోయింది. కానీ అర్ధరాత్రి దాటిన తర్వాత వచ్చిన మానవ మృగాలు ఆ తల్లి నిద్రను ఆసరాగా చేసుకుని ఆమె ప్రాణమైన మూడేళ్ల చిన్నారిని గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్లాయి. తెల్లవారుజామున లేచి చూసేసరికి బిడ్డ కనిపించకపోవడంతో ఆ తల్లి గుండె పగిలేలా రోదించింది. సైబరాబాద్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేవలం కొన్ని గంటల్లోనే నిందితుల ఆట కట్టించి పాపను సురక్షితంగా తల్లి ఒడికి చేర్చారు. ఈ సంచలన కిడ్నాప్, చైల్డ్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మీడియాకు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన బాధితో గోవిందమ్మ (23) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి వీధి వ్యాపారం చేసుకుంటోంది. ఈ నెల 15వ తేదీ రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్ 6 పక్కన ఉన్న భవానీ హోటల్ ముందరి ఫుట్‌పాత్‌పై తన మూడేళ్ల కుమార్తె పుష్పరాణితో కలిసి నిద్రించింది. 16వ తేదీ తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో ఆమె మేల్కొనే సరికి పక్కన ఉండాల్సిన కూతురు కనిపించలేదు. ఆందోళనతో చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్




చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీపీ రమేష్ తో పాటు ఇతర అధికారులు..

ఆధ్వర్యంలో పోలీసులు జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 84 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆర్సీపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్, నార్సింగి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రాజేష్, శేరిలింగంపల్లి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ లతో కూడిన ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సైబరాబాద్, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో సాంకేతిక పరిజ్ఞానం సీసీటీవీ ఫుటేజీలు శాస్త్రీయ ఆధారాల సాయంతో వేట సాగించారు. చివరకు నిందితులు పాపను మహబూబ్ నగర్ తీసుకెళ్లినట్లు గుర్తించారు. బాలికను వేరొకరికి విక్రయించే లోపే నిందితులను చుట్టుముట్టి పాపను రక్షించారు. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన కోతి శ్రీనివాస్ (36) కలిమందిర్, బండ్లగూడకు చెందిన దోమ రామకృష్ణ (23) న్యూ ప్రేమ్ నగర్ నివాసి పాలధి నవనీత (31)

**నర్సు ముసుగులో కిరాతకం.. ముఠా మోడస్ ఆపరేండి!**

ఈ ముఠాకు సూత్రధారి అయిన పాలధి నవనీత మహబూబ్ నగర్‌లోని ఒక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో స్టాఫ్ నర్సు కమ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. హాస్పిటళ్లకు వచ్చే గర్భిణులు, నవజాత శిశువుల సమాచారాన్ని సేకరిస్తూ, పిల్లలు లేని దంపతులతో ఆమె పరిచయాలు పెంచుకుంది. చట్టవిరుద్ధంగా పిల్లలను దత్తత ఇప్పిస్తానని నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసే నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. గతంలో ఇలాగే ఇద్దరు పిల్లలను అక్రమంగా విక్రయించినట్లు విచారణలో తేలింది. సుమారు రెండు నెలల క్రితం రాణి అనే మహిళ అక్రమ దత్తత కోసం నవనీతను సంప్రదించింది. దీంతో నవనీత.. నిందితుడైన శ్రీనివాస్‌ను సంప్రదించి డబ్బు ఆశ చూపి ఏదైనా ఒక చిన్నారిని తీసుకురావాలని పురమాయించింది.

దీంతో శ్రీనివాస్, రామకృష్ణ కలిసి బైక్‌పై 15వ తేదీ రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఫుట్‌పాత్‌పై తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారి పుష్పరాణిని అపహరించి మహబూబ్ నగర్ పారిపోయారు. అక్కడ నవనీత సూచనల మేరకు మహబూబ్ నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో పాపను కొనుగోలుదారుకు అప్పగించి డబ్బులు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అదే సమయంలో చందానగర్, నార్సింగి, సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేసి నిందితులను పట్టుకున్నారు.

**కమిషనర్ అభినందనలు**

సకాలంలో స్పందించి, ప్లాన్ ప్రకారం చిన్నారి ప్రాణాలను కాపాడటమే కాకుండా అక్రమ మానవ రవాణా ముఠా గుట్టురట్టు చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు.

---



## గట్టు గుప్త నిధుల కేసు- కూలీల ఇళ్లలో పోలీసుల సోదాలు

**21 వెండి నాణేలు, బంగారం స్వాధీనం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం)**

గట్టు మండల కేంద్రంలోని శ్యాంసుందర్ జోసి నివాసంలో లభించిన గుప్త నిధులకు సంబంధించిన కేసులో శనివారం పోలీసులు కీలక పురోగతి సాధించారు. లభించిన నాణేలలో కొన్నింటిని దాచిపెట్టుకున్న కూలీల ఇళ్లపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టు ఎస్సై శేఖర్ గౌడ్ మరియు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 21 వెండి నాణేలు, మరియు కొంత బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు:**

జిమ్మేస్ వద్ద నుంచి 10 వెండి నాణేలు, ఒక బంగారు ముక్క,

రాముడు వద్ద నుంచి 9 వెండి నాణేలు, ఒక బంగారు ఉంగరం.

బజారి అనే వ్యక్తి వద్ద ఉన్న ఒక వెండి నాణ్యం, రాముడి వద్ద ఉన్న మరొక వెండి నాణ్యం కృష్ణకు చేరినట్లు విచారణలో తేలింది. దీనితో కృష్ణ వద్ద నుండి ఆ 2 వెండి నాణేలను కూడా పోలీసులు రికవరీ చేశారు. "ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించిన గుప్త నిధులను దాచుకోవడం చట్టరీత్యా నేరం అని ఈ కేసులో ఇంకా ఎవరి వద్దనైనా నాణేలు ఉంటే తక్షణమే పోలీసులకు అప్పగించాలి అని మిగిలిన నాణేల రికవరీ కోసం దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది అని గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్ హెచ్చరించారు.

---

## సమగ్రతను బలోపేతం చేయడంలో ఎస్ఐఆర్ ది కీలక పాత్ర

**సరైన ఓటరు జాబితా రూపొందడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే**

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్**

**కూకట్ పల్లి, జూలై 18 (ప్రభాత ఉదయం)**



"ప్రతి అర్హుడికి ఓటు హక్కు -- ప్రతి ఓటరికి సరైన నమోదు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ ఎల్లమ్మ బండ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో శశిధర్ పట్వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైన పునాది అని అన్నారు. ఓటరు జాబితా కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను మరింత బలోపేతం చేయడంలో ఎస్ఐఆర్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు మాత్రమే కాకుండా ప్రతి అర్హత కలిగిన పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు, కొత్త నమోదు, చిరునామా మార్పులు వంటి వివరాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. "సరైన ఓటరు జాబితా రూపొందడం అంటే ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి తమ వంతు సహకారం అందించాలి" అని ఆయన పేర్కొన్నారు. అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారు, పరిసర ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి, వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్‌ఏలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ్ రెడ్డి, నాయకులు యాదగిరి గౌడ్, అశోక్ గౌడ్, అభిషేక్ గౌడ్, కట్ల శేఖర్ రెడ్డి, యలమంచి ఉదయ్ కిరణ్, మానేపల్లి సాంబశివరావు, దార్గుపల్లి ప్రభాకర్, కమ్మినేని వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, కాలనీవాసులు, టీం పట్వారి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

---

## ఆల్విన్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల చొరవ

**ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ వాల్వ్ మరమ్మతుల పనులను పరిశీలించిన జిల్లా గణేష్**

**రెండు, మూడు రోజుల్లో నీటి సరఫరా సాధారణ స్థితికి వస్తుందని హామీ**

**కూకట్ పల్లి, జూలై 18 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124వ డివిజన్ పరిధిలో గత వారం రోజులుగా తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నీటి మోటార్లు దెబ్బతినడంతో గ్రావిటీ విధానంలో నీటిని పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొనగా, స్థానిక ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌లోని వాల్వ్ మరమ్మతుల పనులు చేపట్టడంతో ట్యాంక్‌కు నీటి నిల్వ పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ నేత ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ తో కలిసి ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని మరమ్మతుల పనులను పరిశీలించారు. వాల్వ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించేలా అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, గత వారం రోజులుగా రెండు నీటి మోటార్లు కాలిపోవడంతో నీటి విడుదలలో తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో కాలిపోయిన రెండు మోటార్లకు మరమ్మతులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు నుంచి మూడు రోజుల్లో మోటార్ల మరమ్మతులు పూర్తవుతాయని, అనంతరం తాగునీటి పంపిణీ యథావిధిగా ప్రారంభమై సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు కొంత సహనం పాటించాలని కోరుతూ, నీటి సమస్యను పూర్తిగా అధిగమించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానికులు కూడా నీటి సమస్యపై కాంగ్రెస్ నాయకులు, అధికారుల తక్షణ స్పందనను అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---




## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ యూత్ డిక్లరేషన్‌ను ఎండగట్టాలి

**మూసాపేట్ డివిజన్ నుండి యువ సంగ్రామం సభకు భారీగా తరలిన యువత**

**కూకట్ పల్లి, జూలై 18 (ప్రభాత ఉదయం)**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ యూత్ డిక్లరేషన్ ను ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన యువ సంగ్రామం సభకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలమేరకు మూసాపేట్ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో యువత భారీగా తరలి వెళ్లారు. అనంతరం మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుంది తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు తూము మనోజ్, అక్షయ్, రాజేష్, గిరీష్, గణపతి, ఉప్పు సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

---



## అమెరికాలోని వర్జినియా టెక్ యూనివర్సిటీతో కలిసి పండు ఈగ యాజమాన్యంపై ఉద్యాన విశ్వ విద్యాలయం పరిశోధనలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం)**

పందిరి కూరగాయలైన కాకర, బీర, సొర , దోస వంటి పంటల పంటలను ఆశించి నష్టపరిచే పండు ఈగ యాజమాన్యంపై అమెరికాలోని వర్జినియా టెక్ విశ్వవిద్యాలయం తో కలిసి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పని చేయనున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి అన్నారు. వర్జీనియా టెక్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ప్రముఖ ప్రపంచ కీటక నిపుణులు డాక్టర్ మునియప్పన్, ఎకనమిస్ట్ డాక్టర్ అనుప గుప్తా ల తో కూడిన బృందం ఉద్యాన విశ్వవిద్యాలయం సందర్శించి వైస్ ఛాన్సలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పందిరి కూరగాయ పంటలలో ఇటీవల కాలం పండు ఈగ ఒత్తిడి, బాగా పెరిగిందని రసాయనాలతో యాజమాన్యం కొనసాగిస్తే భవిష్యత్తులో కష్టమవుతుందని ప్రత్యామ్నాయంగా కేవలం రసాయనాలపై ఆధారపడకుండా సమగ్ర పద్ధతులతో పండు ఈగ యాజమాన్యం చేపట్టాలని కోరారు. హైదరాబాద్ చుట్టుపక్కల 25 కూరగాయల గ్రామాలలో ఉద్యాన విశ్వవిద్యాలయం అమెరికా వర్జీనియా టెక్ వర్సిటీతో కలిసి కూరగాయల్లో తామర పురుగులు, వంకాయ లో కాయ, కొమ్మ తొలిచే పురుగు, క్యాబేజీ, కాలీఫ్లవర్ లో డైమండ్ బ్యాక్ మాత్ యాజమాన్యం పై నూతన పరిశోధనలు చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్తులో రసాయనాలపై ఆధారపడకుండా సమర్థవంతంగా పురుగులు, తెగుళ్లు నివారించే పద్ధతులు అందుబాటులోకి రావాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు డాక్టర్ జే. చీనా, వర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కే. వీరాంజనేయులు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ రాజశేఖర్, కూరగాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ డి. అనిత కుమారి, టెక్నికల్ సెక్రటరీ డాక్టర్ పి. సైదయ్య , ఏటిజిసి బయోటెక్ ఎండి డాక్టర్ మార్కండేయ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి బి రెడ్డి, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

---

## యువ సంగ్రామ సదస్సుకు కదిలిన పటాన్ చెరు గులాబీ దళం

**ఎమ్మెల్యే నాయకత్వంలో 1200 ల వాహనాల్లో తరలి వెళ్లిన గులాబీ శ్రేణులు**

**జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే**

**పల్లెలు, పట్టణాల నుండి కదం తొక్కిన నిరుద్యోగులు, బిఆర్ఎస్ కార్యకర్తలు**


**నిరుద్యోగుల గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి**

**యూత్ డిక్లరేషన్ పేరుతో యువత భవిష్యత్తుకు చరమగీతం పాడారు**

**2028లో ఎగిరేది గులాబీ జెండాయే..**

**పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, జూలై 18, (ప్రభాత ఉదయం):**





అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నేడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయమంటే ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేస్తోందని.. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు 2028 ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగరటం ఖాయమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో 1200 వాహనాల్లో గులాబీ శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. శనివారం ఉదయం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని జిఎంఆర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్ చెరు పురవీధుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్వయానా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ 2023 లో సరూర్ నగర్ స్టేడియం వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటనను నమ్మి యువత, నిరుద్యోగులు ఓటు వేసి అధికారం అప్పగించి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న.. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఓటు కొట్టు,జాబ్ పట్టు అని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ఉద్యోగాలు ఏవని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వ దురహంకారానికి అర్థం పడుతుందని విమర్శించారు. జాబులు నింపడంలో విఫలమైనా రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ కి సూట్ కేసులు పంపడంలో గోల్డ్ మెడల్ సాధిస్తున్నారని ఎద్దేవా చేశారు. అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని 2028లో తిరిగి కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యువత, విద్యార్థి, నిరుద్యోగులకు సువర్ణ యుగం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి, మహిళ, కార్మిక విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు

# ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు





### గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

### రూ. 41.50 లక్షలతో నిర్మించిన పీఎం శ్రీ పాఠశాల అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభం

### టాయిలెట్ల నిర్మాణం కోసం మరో రూ. 10 లక్షల నిధులు మంజూరు

### దాతల సహకారంతో వాటర్ ఫిల్టర్, డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం)ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ఇక్కడ చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యాలతో చదివి అత్యున్నత స్థాయికి ఎదుగుతారని గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీ నందు గల పీఎం శ్రీ (గ్రవీ వాం=×) ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో రూ. 41.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను, సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ వేదావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి విష్ణు గద్వాల ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ"నేను కూడా ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చదువుకోవడం జరిగిందన్నారు. ఈరోజు ఈ పాఠశాలకు రావడంతో నాటి విద్యార్థి రోజుల జ్ఞాపకాలను గుర్తుచేస్తోంది అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారు అని, నేను కూడా ప్రభుత్వ చదువు చదువుకునే ఈరోజు మీ ముందు ఎమ్మెల్యేగా నిలబడ్డాను" అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు కలిగిన టాప్-4 ప్రభుత్వ పాఠశాలలు గద్వాల నియోజకవర్గంలోనే (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ అభ్యున్నత పాఠశాల, ధరూర్ జెడ్పీహెచ్ఎస్) ఉండటం గర్వకారణం అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా టాయిలెట్లు లేవని దీనివల్ల విద్యార్థినిలు ఇబ్బందులు గురవుతున్నారని గద్వాల ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగ టాయిలెట్ల నిర్మాణం కోసం తక్షణమే రూ. 10 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అలాగే త్రాగు నీటి సౌకర్యం కోసం పాఠశాల అభివృద్ధిలో భాగంగా శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి దాతృత్వ సహకారంతో పాఠశాలకు ఉచితంగా వాటర్ ఫిల్టర్ మరియు డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాన్ని అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గద్వాల ఎమ్మెల్యే కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదిగి, తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మరియు గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గద్వాక మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, 16వ వార్డు కౌన్సిలర్ వేదావతి, జిల్లా విద్యాధికారి విజయ లక్ష్మీ, మండల విద్యాధికారి శ్రీనివాసులు గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# మహిళలకు ఉపాధితో ఆర్థిక స్వావలంబన

### గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం)

మహిళలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోనీ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న గ్రామీణ స్వయం ఉ పాధి శిక్షణ కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెలరోజుల పాటు మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వడంతో సొంతంగా పనులు చేసుకుని సంపాదించవచ్చన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పొదుపు సంఘాలలో ఉండడం వలన బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. గద్వాల ప్రాంతంలో ఎక్కడా లేని వస్తువుల తయారీ పరిశ్రమను మహిళలు నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని, దీనికి కావాల్సిన శిక్షణ, రుణ సదుపాయానికి తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, ఎల్డిఎం శ్రీనివాసరావు, ఏపిడి శ్రీనివాస్, ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పలువురు కౌన్సిలర్స్, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.



# ఉరుములు మెరుపుల దాటికి ఎద్దు మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి,జూలై18(ప్రభాత ఉదయం)

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో ఉరుములు మెరుపుల దాటికి గుడిసె పెద్ద ఈరప్పకు చెందిన ఎద్దు మృతి చెందింది. రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఎద్దులను మేత కోసం కట్టివేయగా శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులు దాటికి ఎద్దు మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పవన్ కుమార్ బాధితుడ్ని పరామర్శించారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామసర్పంచ్ గ్రామస్తులు కోరారు.

## 44వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం..

### ఏపీ ఆర్టీసీ బస్సు ఢీకొని ఐదు నెలల గర్భిణీ దుర్మరణం!

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం)

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం పరిధిలోని పుల్లూర్ టోల్ ప్లాజా సమీపంలో 44వ జాతీయ రహదారిపై గల పంచలింగాల(కర్నూల్ జిల్లా) స్టేజి సమీపంలో ఏపీ రాష్ట్రానికి చెందిన అనంతపురం డిపో ఆర్టీసీ బస్సు ఒక బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న ఐదు నెలల గర్భిణీ చాకలి ప్రియాంక (24) తలపై నుంచి బస్సు టైరు దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న ఆమె తండ్రి రాముడికి తీవ్ర గాయాలవడంతో, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వివరాలిలాఉన్నాయి. మానవపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన చాకలి ప్రియాంకకు 2021లో నంద్యాల జిల్లా మిడివేముల గ్రామానికి చెందిన చిన్నబజారు అనే వ్యక్తితో వివాహమైంది. ప్రస్తుతం ఐదు నెలల గర్భంతో ఉన్న ప్రియాంకను, ఆమె తండ్రి రాముడు బైక్‌పై పుట్టింటికి తీసుకువస్తుండగా పంచలింగాల స్టేజ్(కర్నూల్ జిల్లా) సమీపంలో అనంతపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరి బైక్ ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్రియాంక అక్కడికక్కడే కన్నుమూయగా, కడుపులోని ఐదు నెలల బిడ్డ కూడా గర్భంలోనే ప్రాణాలు విడిచింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.కన్నీరు పెట్టిస్తున్న కుటుంబ నేపథ్యం:ఆ కుటుంబంలో ఐదేళ్ల నిరీక్షణ తర్వాత గర్భం దాల్చడంతో పండగ వాతావరణం నెలకొంది. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. మద్దూరు గ్రామానికి చెందిన రాముడికి ముగ్గురు కుమార్తెలు కాగా, పెద్దమ్మాయి, చిన్నమ్మాయి ఇద్దరూ మతిస్థిమితం కోల్పోయి జీవిస్తున్నారు. రెండో కుమార్తె ప్రియాంక మాత్రమే ఆ తండ్రికి కొండంత అండ. ఐదేళ్లుగా పిల్లలు లేని ప్రియాంక గర్భం దాల్చడంతో, సుఖ ప్రసవం కోసం తండ్రి ఎంతో ఆశగా కూతురిని పుట్టింటికి తీసుకువస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై బస్సు రూపంలో వచ్చిన మృత్యువు ఆమెను కబలించింది. కళ్లముందే హుషారుగా ఉన్న కూతురు రక్తపు మడుగులో పడి ఉండటం చూసి, తీవ్ర గాయాలతో ఆసుపత్రి బెడ్‌పై ఉన్న ఆ తండ్రి గుండె పగిలేలా రోదిస్తున్న తీరు స్థానికులను సైతం కన్నీరు పెట్టిస్తోంది. ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.



## పీవీ రమణ తండ్రి వెంకయ్య మృతికి బండి రమేష్ ప్రగాఢ సంతాపం

కూకట్ పల్లి, జూలై 18 (ప్రభాత ఉదయం)

కేపీహెచ్‌బీ 3వ రోడ్డులోని శివాలయం చైర్మన్ పీవీ రమణ తండ్రి వెంకయ్య స్వర్గస్తులైనట్లు తెలిసి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ వారి స్వగృహానికి వెళ్లి వెంకయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకయ్య మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని, వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని బండి రమేష్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, దినేష్, రాజేష్, అరవింద్, గోపాల్, గంధం రాజు, రంగమోహన్, పనీంద్ర, శ్రీనివాస్ బాబు, ఎల్లేష్ యాదవ్, నరసింహ, శ్రీకాంత్ పటేల్, రవి, రజిత, సుజాత, వాణి తదితరులు పాల్గొని వెంకయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రన్ ఫర్ ఎస్ఎంఎ గోడ పుత్రికను ఆవిష్కరిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తో పాటు ఇతర అధికారులు..

## అరుదైన వ్యాధిపై అవగాహనకు 'రన్ ఫర్ ఎస్ఎంఏ'

### ఆగస్టు 9న గచ్చిబౌలి స్టేడియంలో 4వ ఎడిషన్ పరుగు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ యం.రమేష్

శేరిలింగంపల్లి : జూలై 18, (ప్రభాత ఉదయం)

స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే అరుదైన జన్యుపరమైన వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బాధితులకు అండగా నిలిచేందుకు 'క్యూర్ ఎస్ఎంఏ ఇండియా' సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 9న భాగ్యనగరంలో భారీ పరుగు పందెం నిర్వహించనున్నారు. 'రన్ ఫర్ ఎస్ఎంఏ - 2026' పేరిట గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరగనున్న ఈ 4వ ఎడిషన్ రన్ అధికారిక పోస్టర్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ యం. రమేష్ గచ్చిబౌలిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ ఎస్ఎంఏ వ్యాధిగ్రస్తులకు మద్దతుగా క్యూర్ ఎస్ఎంఏ ఇండియా సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. సమాజంలో ఈ వ్యాధిపై విస్తృత అవగాహన రావాల్సిన అవసరం ఉందని ఈ పరుగులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నాలుగు విభాగాల్లో పోటీలు గ్లోబల్ ఎస్ఎంఏ అవగాహన మాసం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్యూర్ ఎస్ఎంఏ ఇండియా సహ వ్యవస్థాపకురాలు ట్రస్టీ శ్రీలక్ష్మి నలం తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఈ పరుగును నాలుగు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**21 కే, 5 కే, 10 కే టైమ్డ్ రన్ 5 కే నాన్-టైమ్డ్ రన్**

ఈ పరుగులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ టీషర్ట్, మెడల్, సర్టిఫికేట్ అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ రేసులో విద్యార్థులు, కార్పొరేట్ ఉద్యోగులు, వైద్య నిపుణులు, ఎస్ఎంఏ బాధిత కుటుంబాలతో పాటు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు.

ప్రముఖుల హాజరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సీనియర్ జెనెటిసిస్ట్ డాక్టర్ రాధా రమా దేవి, నిమ్స్ న్యూరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సూర్యప్రభ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సీఈఓ నవేద్ ఆలం ఖాన్, ఎస్ఎంఏ సహ వ్యవస్థాపకులు శ్రీలక్ష్మి, అర్చన పాండా, మైక్రోసాఫ్ట్ ప్రతినిధి విజయ్ వావిలాలతో పాటు పలువురు వైద్య, పరిశోధన నిపుణులు పాల్గొన్నారు.

నమోదు చేసుకోండిలా. 'రన్ ఫర్ ఎస్ఎంఏ - 2026' లో పాల్గొనదలిచిన వారు ఇతర వివరాల కోసం 8885004858 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.



## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి ఉదారత -- అభినందించిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 ( ప్రభాత ఉదయం)

గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుకు మరియు స్వచ్ఛమైన త్రాగునీటి అవసరాల కోసం శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత, సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించి గొప్ప ఉదారతను చాటుకున్నారు. శనివారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలో త్రాగు నీటి సమస్య ఉందని, అలాగే డిజిటల్ క్లాస్ రూమ్ (×ఖీ్రా) ఏర్పాటు చేయాలని విద్యార్థులు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఆధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (×త్వతీఖ్షిఱజవ ఖీశ్రీఖ్రాఖఅవశ్రీ) డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాన్ని, అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్వో (=ూ) ప్లాంట్ త్రాగునీటి వసతిని కల్పించడానికి బండ్ల రాజశేఖర్ రెడ్డి ముందుకు రావడంతో గద్వాల్ ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యా వసతులను కల్పించేందుకు, మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములైన శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి సేవా నిరతి ఎంతో అభినందనీయమన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి అండగా నిలిచిన బండ్ల రాజశేఖర్ రెడ్డి కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608